క్లుప్తంగా

ఘనంగా ముగిసిన కోదండరామస్వామి తిరునాళ్ల



ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బొంతవారిపల్లెలో మూడు రోజులుగా జరుగుతున్న కోదండరామస్వామి తిరునాళ్ల గురువారం ఉత్సవంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా అర్చకులు పంచాగ్నుల రామమూర్తి శర్మ సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు, ఉత్సవమూర్తులకు విశిష్ట పూజలు చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులకు భజంత్రీల మేళతాళాల నడుమ, బాణాసంచా కాల్చుతూ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో 3 రోజుల పాటు మహాఅన్నదానం నిర్వహించగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పచ్చిరొట్ట విత్తనాలు ఉపయోగించుకోవాలి



రైతులకు వివరిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): రైతులకు 50 శాతం రాయితీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు ఉపయోగించుకోవాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దరాజుపాలెంలో గురువారం జరిగిన కార్యక్రమంలో జనుము, జీలుగ, పిల్లిపెసర సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పచ్చిరొట్ట విత్తనాలు వేసి పంట పూతవచ్చిన వెంటనే భూమిలో కలియదున్నితే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, అఖిల్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

కొండపి: రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ ఆన్ వీల్స్ ప్రోగ్రాంను రెండు రోజులపాటు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఆధునిక సాంకేతిక పై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. జిల్లా స్కిల్ హబ్ డెవలప్‌మెంట్ అధికారి రవితేజ, ట్రైనర్ కార్తీక్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



పోటీలకు హాజరైన విద్యార్థులు

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో గురువారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లీషు క్లాసులు నిర్వహించిన అనంతరం డిక్టేషన్ పోటీలు జరిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు భాస్కర్‌రాజా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు చెప్పారు. విద్యార్థులతో చేత నీతికథలు చదివించారు. విజ్ఞానదాయకమైన పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను చదివించారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేసవిశిక్షణా తరగతులకు 22 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, 16వ ఆర్థిక సంఘ సభ్యులు(కమిషన్ ఆఫ్ ఇండియా) సౌమ్య కంటి ఘోషేకు, ఏపి మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కమిషనర్ సంపత్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందచేశారు. తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘ సభ్యుల సమావేశంలో చైర్మన్ గఫార్ పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ గఫార్ మున్సిపల్ భవన్ నిర్మాణానికి రూ.6 కోట్లు, కూరగాయల మార్కెట్‌కు రూ.3 కోట్లు, మటన్, చికెన్ మార్కెట్‌కు రూ. 3కోట్లు, నూతన డ్రైనేజీల కోసం రూ.4 కోట్లు మంజూరు చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు.

గూడు.. గోడు వినేదెవరు..?

- పేదల ఇళ్లపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 620 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- ఇళ్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం
- చిట్టడివిని తలపిస్తున్న జగనన్న కాలనీలు



పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో చిట్టడవిని తలపిస్తున్న జగనన్న కాలనీ ప్లాట్లు

పీసీపల్లి:

పేదల సంక్షేమంటే కూటమి ప్రభుత్వానికి పట్టదు. అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా పేదల సంక్షేమానికి తీసుకున్న కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కోట్లాది రూపాయల విలువైన భూములు కొనుగోలు చేసి పట్టాలు పంపిణీ చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇళ్ల మంజూరు ఊసే ఎత్తడం లేదు. దీంతో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలు ప్రస్తుతం చిట్టడవిని తలపిస్తున్నాయి. ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.

620 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 18 పంచాయతీల్లో 20 లే అవుట్లు వేసి చేశారు. మొత్తం మండలంలో 620 మంది నిరుపేదలకు నివేశన స్థల పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల స్థల పట్టాల లబ్ధిదారులను గుర్తింపులో పార్టీలకతీతంగా అర్హులందరికీ పంపిణీ చేశారు. దరఖాస్తు చేసుకునేందుకు కూడా ముగింపు, గడువు లేకుండా వెసులుబాటు కల్పించారు. లబ్ధిదారుల ఎంపికలు ఎటువంటి పొరపాట్లు లేకుండా పలు కోణాల్లో పరిశీలించి అధికారులు పారదర్శకంగా అర్హుల జాబితాను ఎంపిక చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వందల మందికి పట్టాలు అందజేశారు. లబ్ధిదారులను వారికి కేటాయించిన ప్లాట్లు దగ్గర ఉంచి జియో ట్యాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

గోడు వినేదెవరు..?

2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధఇకారంలోకి వచ్చిన తర్వాత పేదల గూడుపై కక్ష కట్టింది. ఇళ్ల స్థల పట్టాలు ఉన్నా ఇళ్లు మంజూరు చేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత లబ్ధిదారులను పరిశీలన పేరుతో ఇళ్ల పట్టాలు పొందిన వారి వద్ద నుంచి జిరాక్స్ పత్రాలు తెప్పించుకున్నారు. ఇల్లు మంజూరు చేస్తారేమోనని ఆశగా చూసిన లబ్ధిదారులకు నిరాశ ఎదురైంది. కంటి తొడుపు చర్యగా జిరాక్స్ పత్రాలు తీసుకున్నారు తప్ప తరువాత పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆ ప్లాట్ల గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో స్థలాలన్నీ ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు మొలిచి చిట్టడవిని తలపిస్తున్నా. అసలు ఎవరు ప్లాట్ ఎక్కడుందో కూడా గుర్తు పట్టలేనంతంతగా తయారయ్యాయి. హద్దు రాళ్లు కూడా కనిపించడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్లాట్లను అభివృద్ధి చేసి ఇళ్లను మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు

ఇల్లు లేక ఇబ్బంది పడుతున్నాం:



గత ప్రభుత్వం మాకు ఇంటి పట్టాలు మంజూరు చేసింది. ఇల్లు లేకపోవడంతో బంధువుల ఇళ్లలో ఉంటూ కూలి పనులకు వెళ్లి పొట్ట పోసుకుంటున్నాం. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే మా లాంటి వారికి ఇంటి వసతి వస్తుంది.

దేవదాసు, తలకొండపాడు

ఎవ్వరూ పట్టించుకోవడం లేదు:



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు ఇంటి పట్టా మంజూరుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. ఇల్లు మంజూరు చేస్తే సొంతింటి కల నెరవేరుతుంది.

మూలే మల్లికార్జున పీసీపల్లి

నరసారెడ్డి భౌతికకాయానికి నివాళి



నరసారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల, చింతలచెరువు, నేతలు

కనిగిరిరూరల్: పట్టణంలోని కొత్తూరులో అచ్చాల ఆదినరసారెడ్డి భౌతిక కాయానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, ఏడీ రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ఆదినరస్సారెడ్డి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కౌన్సిలర్ తమ్మినేని సుజాతరెడ్డి, న్యాయవాది అచ్చాల నర్సారెడ్డి, కర్నాటి సుబ్బారెడ్డి, అచ్చాల శ్రీనివాసులరెడ్డి, చంటి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, చింతం శ్రీను, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, ఈర్ల శ్రీను పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.రత్నజ్యోతి

కందుకూరు రూరల్: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన గురువారం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి నివేదికలు చదివి వినిపించారు. మండలంలో మూడు గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. రీసర్వేలో 200 ఎకరాల ఏడబ్ల్యూ ల్యాండ్‌పై సమస్య గురించి ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కరించడం లేదని జి.మేకపాడు సర్పంచ్ బ్రహ్మయ్య ప్రశ్నించాడు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని డీటీ తెలిపారు. అదే విధంగా పలుకూరు గ్రామంలో రీ సర్వేలో ఒకే రైతుకు రెండు, మూడు ఖాతా నంబర్లు వస్తున్నాయి. రైతుకి ఒక ఖాతా నంబరే రావాలి కదా ఇలా ఎందుకు జరుగుతుందని ఎంపీటీసీ పున్నయ్య అడిగారు. పలుకూరు గ్రామంలో ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సు నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని టీడీ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వి.రాము, ఎంఈఓ కె.సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్కే నాయబ్ రసూల్, డీటీ హస్సేన్,. పశు వైద్యాధికారి ఎస్ సుధాకర్‌లు వారి శాఖల సమాచారంపై మాట్లాడారు. ఎంపీడీఓ పి.రత్నజ్యోతి మట్లాడుతూ సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలను ఆయా శాఖాధికారులు పరిష్కరించాల్నారు. తిరిగి సమావేశంలో అదే సమస్య తిరిగి పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అన్ని శాఖల అధికారులు దీనిని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తొట్టెంపూడి అనసూర్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవంలో ఆదిమూలపు



దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్

సింగరాయకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నాగూర్‌వలీ దర్గాలో జరుగుతున్న గంధమహోత్సవంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం రాత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందూ, ముస్లింల ఐక్యతకు గంధమహోత్సవం వేదికని కొనియాడారు. తరువాత అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్‌రియాజ్, జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కాకిరణ్‌కుమార్, 108 మస్తాన్, సోమిశెట్టి సురేష్, సయ్యద్ ఆబిద్‌అలీ, షేక్ కరిముల్లా, షేక్ కరీం, షేక్ నౌషాద్, చొప్పర శివ, పాలూరి శ్రీనివాసులరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన డాక్టర్ ఆదిమూలపు



సుందరరెడ్డిని పరామర్శిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: మండలంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. పాకలలో పార్టీ సీనియర్ నాయకుడు గోళ్లమూడి సుందరరామిరెడ్డి అనారోగ్యానికి గురవటంతో గురువారం రాత్రి ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. గ్రామంలోని నాయకుడు కేశవరపు కృష్ణారెడ్డి తల్లి సుభద్రమ్మ అనారోగ్యానికి గురవటంతో ఆమెను పరామర్శించి కుమారుడు కృష్ణారెడ్డికి ధైర్యం చెప్పారు. అంతకుముందు మూలగుంటపాడు పంచాయతీలో పసుపులేటి భాస్కర్ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్, జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్ పాల్గొన్నారు.

చొప్పర శివ, నరేష్, సోమిశెట్టి సురేష్, ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌రెడ్డి, షేక్ అల్లాఉద్దీన్, షేక్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుర్రా జన్మదిన వేడుకలు



కందుకూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు

కందుకూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి మధుసూధన్‌యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లింగసముద్రం: స్థానిక పార్టీ కార్యాలయంలో బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, కన్వీనర్ నోటి వెంకటేశ్వరరెడ్డి కేక్ కట్ చేశారు. కోఆప్షన్ సభ్యుడు షేక్ షఫి, ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడుతో పాటు మేజర్ పంచాయతీ కరేడులో బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఉలవపాడు వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కరేడు వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. మండల కన్వీనర్ పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, యంపీటీసీ రాధామాధవి, ఇతర విభాగాల నేతలు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎంవీ శివరామిరెడ్డి

కనిగిరిరూరల్: ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా తయారీలు రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని ఆర్డీఓ(ఎఫ్‌ఏసీ), ఎన్నికల నమోదు అధికారి ఎంవీ శివరామిరెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగవంతం చేసేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలపై ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఈమేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సలహాలు, సూచనలు చేశారు.

5 నుంచి మదన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలపై సంఘ నాయకులతో చర్చిస్తున్న ఈఓ నరసింహబాబు

పామూరు: పామూరు రుక్మిణి, సత్యభామా సమేత మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహ బాబు తెలిపారు. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి ఉభయదాతలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మొదటి రోజు బ్రాహ్మణ ఉభయం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, అభిషేకం, తులసిపూజ, ప్రత్యేక పూజలు, సాయంత్రం పుట్టబంగారు తేవడం, అంకురార్పణ, ఉభయదాతల పూజలు, స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ ఉత్సవం రుత్వికుల వేదమంత్రాల నడుమ జరుగుతాయన్నారు. 17 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలను జయప్రదం చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు ఆకుమళ్ల చలపతి, వితపు కుమార్, కొల్లూరి రవికిరణ్‌శర్మ, మహంకాళి శివప్రసాద్, చిమట కార్తీక్, నారాయణం సత్యబాబు, జేవీఎస్ సుబ్బయ్య, జేవీఎస్ ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

పొగాకు కనిష్ట ధర రూ.210



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి సునీల్‌కుమార్



వేలం నిర్వహిస్తున్న నిర్వహణ అధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 1146 బేళ్ల కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. కస్టర్ పరిధిలోని నేతివారి పాలెం, రామచంద్రపురం గ్రామాలకు చెందిన రైతులు 1282 బేళ్లను వేలానికి తీసుకురాగా 136 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.210, సరాసరి ధర రూ.255.60గా నమోదైంది. వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య సందర్శించారు.

రైతును బట్టి గ్రేడ్

అధికారులు రైతులను బట్టి గ్రేడ్లు నిర్ణయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం నిర్వహించిన వేలంలో ఒక పొగాకు బేలుకు ఎఫ్–3 గ్రేడ్‌గా నమోదు చేశారు. వెంటనే గుర్తించిన రైతు అటు పోతున్న అధికారిని సార్ నా బేలుకు ఎఫ్–3 గ్రేడ్‌గా నమోదు చేశారని ప్రశ్నించగా, వెంటనే ఆ అధికారి ఎంఎఫ్–2 గా మార్చారు. ఇలా రైతులను బట్టి కూడా గ్రేడ్లను మారుస్తున్నారన్న ఆరోపణలు కొండపి బోర్డులో వినిపిస్తున్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ.205 పలికినట్లు వేలం నిర్వహణ అధికారి ఏ. శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని మల్లవరప్పాడు, శివపురం, గొర్లమెట్ట, మట్టిపాడు గ్రామాలకు చెందిన రైతులు 757 బేళ్లను వేలానికి తీసుకురాగా 533 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 224 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.239.64గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మ తల్లి తిరునాళ్ల



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

పీసీపల్లి: మండలంలోని వెంగళాపురం సమీపంలోని పాలేటి నది ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లి తిరునాళ్లను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ తిరునాళ్లలో బొల్లావులను ఎత్తుకున్న భక్తులు చేసే నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవున్నాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు 9 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తిరునాళ్లకు హాజరవుతారు. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

సభా ప్రాంగణాన్ని పరిశీలించిన దద్దాల

తిరునాళ్లను పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. వైఎస్సార్ సీపీ ప్రభ ఏర్పాటు చేసేప్రాంతాన్ని పరిశీలించారు. పార్టీ జిల్లా నాయకులు హాజరు కానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈయన వెంట మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఓకే రెడ్డి, పిచ్చిరెడ్డి బాలయ్య, పూలు జయరాం రెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బొమ్మ దత్తాత్రే, అంజిరెడ్డి, వెంకట్రావు, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

కనిగిరిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరుకు సిద్ధం కావాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్ అన్నారు. స్థానిక కొత్తపేటలో సూరసాని చిన వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ చట్టాలపై కార్మిక లోకం ప్రతిఘటనకు సిద్ధం కావాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై రవీంద్రబాబు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ స్పందించి ఉద్యమాలు చేపట్టాలన్నారు. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలం చెందాయన్నారు. జీపీ రామారావు, బృంగి సుబ్రహ్మణ్యం, పందిటి మోహన్, పసుపులేటి శ్రీనివాసరావు, సునీత పాల్గొన్నారు.

అధ్వాన పారిశుద్ధ్యంపై ఆగ్రహం



ఊళ్లపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ



సోమరాజుపల్లి పంచాయతీలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి, ఊళ్లపాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గురువారం ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సోమరాజుపల్లిలోని సంపద తయారీ కేంద్రం నిర్వహణ సరిగా లేదని, పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంపై ఒంగోలు డీఎల్‌పీఓ పద్మ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్డు ప్రక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అమలులో కార్యదర్శి నిర్లక్ష్యంగా వహిస్తున్నారన్నారు. తరువాత ఊళ్లపాలెం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించినా ఆ కేంద్రంలో సంపద తయారు కాకపోవటంపై ఆమె విస్మయం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వసిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వారం రోజుల్లో సంపద తయారీ కేంద్రం వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కార్యదర్శి షేక్ సైదులను హెచ్చరించారు.